క్లుప్తంగా

అద్దెకు ఆర్టీసీ బస్సులు

మణుగూరు రూరల్: వివాహాది శుభకార్యాలకు, విహారయాత్రలకు ఆర్టీసీ మణుగూరు డిపో బస్సులు అద్దెకు ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ శ్యాంసుందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బస్సులను పదిశాతం రాయితీపై అద్దెకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బస్సులను అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటే ప్రత్యేక బహుమతి అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని డిపో పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు

మణుగూరు రూరల్ : మండలంలోని మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సబ్ డివిజన్ పరిధిలోని మణుగూరు, పినపాక, అశ్వాపురం, కరకగూడెం మండలాల ప్రజలకు ఆదివారం ఉచితంగా కటి వైద్యపరీక్షలు చేయనున్నట్లు నేత్ర వైద్యాధికారి డాక్టర్ జి.సంజీవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి శుక్లాలు ముదిరిన బాధితులకు ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించడం జరుగుతుందని, ప్రతీ ఆదివారం కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 8317684159 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి : మండలకేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం వైభవోపేతంగా జరిపించారు. ప్రధానార్చకులు ప్రసాదచార్యులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. మేనేజర్ వెంకటరమణ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కరకగూడెం: మండలంలోని కొండాయిగూడెం గ్రామానికి చెందిన బాషు కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా షఫియా మస్జీద్ కమిటీ సదర్ సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, సభ్యులు శనివారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు షేక్ ఖలీల్, హైమద్,షేక్ రియాజ్, షేక్ మొహమ్మద్ హుస్సేన్, షేక్ అలీ, యునుస్, జహురుద్దీన్, సలీం, గౌసుద్దీన్, సోని, జలీల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలి

కరకగూడెం: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని టీడీపీ మండలాధ్యక్షుడు సిరిశెట్టి కమలాకర్ అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ... ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలపాలని సూచించారు.

బస్‌పాస్ మేళా



దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

చండ్రుగొండ: మండలకేంద్రంలో కొత్తగూడెం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన దివ్యాంగుల బస్‌పాస్ మేళా విజయవంతమైంది. అర్హులైన 40 మంది దివ్యాంగులకు, 50 శాతం రాయితీపై పాస్‌లు అందించినట్టు అధికారులు ఇసనపల్లి శామ్యూల్, నరేందర్ తెలిపారు.

పార్టీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ధర్మయ్య

దమ్మపేట: బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుంజా ధర్మయ్య అన్నారు. శనివారం మండలకేంద్రంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ చేపట్టిన ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో అనుసరించవలసిన విధి విధానాలను పార్టీ నాయకులకు వివరించారు. నాయకులు కొలికపోగు ముసలయ్య, మడివి రవి, దుర్గా శ్రీనివాస్, పసుమర్తి పుల్లారావు, నాగరాజు, ప్రశాంత్, కృష్ణవేణి పాల్గొన్నారు.

సమోసాలు..



కట్‌మిర్చి



మిరపకాయ బజ్జీలు



పునుగులు



హాట్‌గా తినాలి గురూ..

జోరుగా చిరుతిళ్ల వ్యాపారం
- వర్షాకాలంలో మరింత విరివిగా అమ్మకాలు
- సాయంత్రం వేళల్లో కిక్కిరిసిపోతున్న స్టాళ్లు
- ఉపాధి పొందుతున్న వందల కుటుంబాలు



భద్రాచలంలోని ఓ హోటల్ వద్ద రద్దీ

సండే స్పెషల్

భద్రాచలంఅర్బన్: వర్షాకాలంలో వాతావరణం చల్లబడడంతో ప్రజలు వేడివేడిగా ఏదైనా తినాలని కోరుకుంటున్నారు. ఆకలికి ఉపశమనం కోసం కొందరు.. నోటికి రుచిగా ఉండేందుకు చిరుతిళ్లు తీసుకునేవారితో పట్టణంలోని అన్నిస్నాక్స్ సెంటర్లు కళకళలాడుతున్నాయి. వానాకాలంలో చిరు వ్యాపారులకు కలిసొస్తున్న ఉపాధిపై సండే స్పెషల్..

సందడిగా స్టాళ్లు..

ప్రజలు ఆదరిస్తుండటంతో చిరుతిళ్ల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణంలో వందల సంఖ్యలో చిరుతిళ్ల హోటళ్లు, బజ్జీల బండ్లు, రోడ్డు పక్కన దుకాణాలు వెలిశాయి. అంబేడ్కర్ సెంటర్, యూబీ రోడ్డు, చర్ల రోడ్డు, కూనవరం రోడ్డు, రామాలయం వీధి, పాత మార్కెట్ రోడ్డు, ఐటీడీఏ రోడ్డు, మసీద్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాలతో పాటు హోటళ్లు, సాయంత్రం వేళల్లో జరిగే మొబైల్ వ్యాపార బండ్లకు గిరాకీ ఎక్కువగా ఉంది. సాయంత్రం వేళలో నడిచే చిరు తినుబండారాల స్టాళ్లు, రోజంతా నిర్వహించే హోటళ్లు వందల సంఖ్యలో ఉండగా రెడీమేడ్ స్నాక్స్ అమ్ముతున్నారు. సాయంత్రం 5గంటలు దాటితే చాలు ఆయా స్టాళ్లు కిక్కిరిసిపోతున్నాయి.

పెరిగిన డిమాండ్..

చిరువ్యాపారులకు చిరుతిళ్ల అమ్మకాలకు వర్షాకాలంలో గిరాకీ పెరగడంతో వ్యాపారులకు మరింత కలిసొస్తుంది. ఎప్పటికప్పుడు వేడివేడిగా తయారు చేస్తూ సాయంత్రం నుంచి రాత్రి 10 వరకు అమ్మకాలు సాగిస్తూ పార్ట్ టైంగా నిత్యం గ్యారెంటీ ఉపాధిని పొందుతున్నారు. వ్యాపారంపై ఆధారపడి సుమారు 500 వందల మంది ఉపాధి పొందుతున్నారు. వివిధ రుచులను ఆస్వాదించే వారికి తగ్గట్టుగా తమ స్టాల్స్‌లో స్నాక్స్ అందిస్తున్నారు.

చల్లని సాయంత్రం.. వేడివేడిగా..



వంకాయ బజ్జీలు సిద్ధం చేస్తున్న నిర్వాహకుడు

చల్లని సాయంత్రం కాగానే ప్రజలు చిరుతిళ్ల బండ్లు, స్టాళ్లవైపు వెళ్తున్నారు. వారి అభిరుచికి తగ్గట్టు మిరపకాయ, వంకాయ బజ్జీలు, పకోడీలు, వెజ్ మంచూరియా, వివిధ రకాల బజ్జీలు, పునుగులు, ఉల్లిపాయ సమోసాలు, తదితరాలు వేడివేడిగా దొరుకుతున్నాయి. ప్రజలు ఎక్కువగా కట్ మిర్చి, వంకాయ బజ్జీని కోరుతున్నారు. పట్టణంలో కట్ మిర్చి, వంకాయ బజ్జీలు ఇక్కడి ప్రత్యేకంగా ఆదరిస్తున్నారు. అప్పుడే కడాయిలోంచి తీసిన వేడి మిర్చి తింటూ ఆస్వాదిస్తున్నారు. హోటల్‌కు వెళ్లలేని వారు ఆర్డర్లు సైతం చేసి తెప్పించుకుంటున్నారు.

వేడిగా తినాల్సిందే..



వాతావరణం చల్లగా ఉంటే సాయంత్రం కాగానే వేడివేడిగా ఏదైనా తినాలనిపిస్తుంది. నోటికి రుచిగా నిర్వాహకులు తయారు చేసే స్టాళ్ల ప్రత్యేకమైన కట్ మిర్చి తింటే ఎంతో బాగుంటుంది. సాయంత్రం చిరుతిళ్లుగా వీటిని తీసుకోవడానికి ఎక్కువ ఇష్టపడుతా, మంచి నూనె వాడే స్టాలికే వెళ్తాం.

– గంజి. ఎడ్వర్డ్ రాజు , భద్రాచలం

నిర్వాహకులు పరిశుభ్రత పాటించాలి



భద్రాచలంలో దొరికే చిరుతిళ్లు ప్రత్యేకంగా ఉంటాయి. ఒక్కో స్టాల్లో ఒక్కో స్నాక్స్ స్పెషల్‌గా చేస్తున్నారు. ఎక్కడా లేని విధంగా కూనవరం రోడ్డులో వంకాయ బజ్జిని తయారు చేస్తారు. మంచి రుచులతో అందించే ఫుడ్ స్టాల్ నిర్వాహకులు పరిశుభ్రత పాటించాలి. ఫుడ్ సేఫ్టీ అధికారులు స్టాళ్ల నిర్వహణపై పర్యవేక్షించాలి.

– కాటా అనిల్, సారపాక.

రూ.18వేల వేతనం అందించాలి



మాట్లాడుతున్న పద్మ

బూర్గంపాడు: ఆశావర్కర్లకు నెలకు రూ.18వేల వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ డిమాండ్ చేశారు. సారపాకలో శనివారం జరిగిన తెలంగాణ ఆశవర్కర్ల యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆశవర్కర్ల వేతనాలను పెంచాలని, ఆశావర్కర్లకు సబ్ సెంటర్ల డ్యూటీలు రద్దు చేయాలన్నారు. ఆశవర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతీ నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు, అనసూర్య, తార, నాగమణి, విజయ, తిరుపతమ్మ, పద్మ పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల వితరణ



బెంచీలు అందజేస్తున్న హితేష్, కాంగ్రెస్ నాయకులు

దమ్మపేట: మండలంలోని దురదపాడు ప్రాథమిక పాఠశాలకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మనవడు, చేతన ఫౌండేషన్ ఫౌండర్ అయిన వల్లభనేని హితేష్ బెంచీలను వితరణగా అందజేశారు. ఈ మేరకు శనివారం గ్రామస్తులు, నాయకుల సమక్షంలో రూ.లక్ష విలువగల బెంచీలను హితేష్ పాఠశాల సిబ్బందికి అందజేశారు. ఈ నాయకులు కాసాని నాగప్రసాద్, సోయం ప్రసాద్, కె.వి.సత్యనారాయణ, కొయ్యల అచ్యుతారావు మడకం సుశీల, ఎర్రా వసంత రావు, విజయ్, శేఖర్, ఉపాధ్యాయులు, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

హక్కులు వినియోగించుకోవాలి

ములకలపల్లి: ఏజెన్సీ ప్రాంతంలోని వారు తమ హక్కులను వినియోగించుకోవాలని ఆదివాసీ జేఏసీ నాయకులు మడకం చిరుమప్ప అన్నారు. మండలకేంద్రంలోని గుడ్ షఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గుడ్‌షఫర్డ్ సిస్టర్స్ నిర్మల, దిప్తి, రాజ్యం, బెనోసియా, సిబ్బంది సందీప్, నాగరాజు, సుజాత, బాలరాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన ఆదివాసీలు..

వైద్యశిబిరాలు



భద్రాచలంఅర్బన్: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఆల్ పెన్షనర్స్ భవనంలో ఆయుష్ వైద్య విభాగం ఆధ్వర్యంలో శనివారం వృద్ధులకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం హోమియో వైద్యులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. జిల్లా ప్రాజెక్టు మెనేజర్ మహేష్ గౌడ్, ఫార్మసిస్ట్ రత్నవళి, పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు భూషన్‌రావు, తులసీదాస్, హనుమంత్ రావు, తదితరులు, పాల్గొన్నారు.

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని భగత్ సింగ్ నగర్, కాళీమాత ఏరియా, వడ్డెర బజార్ తదితర ఏరియాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు శివకుమార్ రోగులకు బీపీ, షుగర్ టెస్టులు చేసి అవసరమైన మందులు అందించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించి నీటి పరిసరాల్లో నీటినిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. రాంప్రసాద్, రామలక్ష్మి, కుమారి, మనిషా, నాగమణి, రవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్ల రూరల్: మండలంలోని గొంపల్లి, పూజారిగూడెం గ్రామాల్లో కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీధర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. పాతచర్ల పూజారిగూడెంలో డాక్టర్ శ్రీధర్, గొంపల్లి గ్రామంలో హోమియోపతి డాక్టర్ పూజలు వంద మందికి వైద్య చికిత్సలు అందించారు. హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ జోగమ్మ, రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మణుగూరు టౌన్: భగత్‌సింగ్ నగర్‌లో..



చర్ల రూరల్: గొంపల్లి గ్రామంలో..

కాంగ్రెస్ పాలనలో పల్లెలకు మహర్దశ

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్: కాంగ్రెస్ పాలనలోనే పల్లె గ్రామాలకు మహర్దశ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తొగ్గూడెం, తిర్లాపురం గ్రామాల్లో రూ.38.75 లక్షల విలువైన 11 సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నార గత పాలకులు ఇచ్చిన మాటలు కేవలం హామీలకే పరిమితమై పాలన అస్తవ్యస్తమైందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఆరుగ్యారంటీల అమలుకు కృషి చేస్తుందన్నారు. వైఎస్సార్ హయాంలో రుణమాఫీ చేసి రైతుల గుండెల్లో పదిలమైన స్థానం సంపాదించుకున్న పార్టీ మళ్లీ రుణమాఫీ చేసి చరిత్ర తిరగరాసిందన్నారు. అనంతరం తొగ్గూడెంలో ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కను నాటారు. తొగ్గూడెంలో గ్రామస్తులు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు శివ, నాయకులు వీరంకి వెంట్రావ్, కూచిపూడి బాబు, గుడిపూడి కోటేశ్వరరావు, మల్లికాంబ, గాండ్ల సురేశ్, పాతూరి వెంకన్న, పెనుగొండ సాంబశివరావు, అధికారులు రామారావు, అరుంధతి, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, పంచాయతీల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు



ఎమ్మెల్యే తెల్లంను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

భద్రాచలంఅర్బన్: రోటరీక్లబ్ ఆఫ్ భద్రాచలం రివర్ సైడ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని కూనవరం రోడ్డులో అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో క్లబ్ మాజీ అధ్యక్షుడు బూసిరెడ్డి నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లబ్ చేస్తున్న ప్రస్తుత సేవలతో పాటుగా ఈ గిరిజన ప్రాంతంలో చిన్నచిన్న చెక్‌డ్యాములు, చెరువుల మరమ్మతులు, విద్యావైద్యంపై కూడా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రాజెక్టుకు అయ్యే ఖర్చులో తమ వంతు ఆర్థికసాయం అందిస్తామని, కంపెనీలతో మాట్లాడి వారి సీఎస్ఆర్ నిధుల ద్వారా కూడా ఆర్థిక సహాయ వెసులుబాటును అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడిగా రోటేరియన్ డా.మడిపెద్ది రమేష్ బాబు, కార్యదర్శిగా గంజి సంపత్, ట్రెజరర్‌గా ధనకొండ రాఘవయ్య, పాస్ట్ గవర్నర్ డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిప్యూటీ గవర్నర్ డి.సాంబశివరావు, అసిస్టెంట్ గవర్నర్ పి.భూషణ్ రావు, వైద్యులు డా.దేవరాజ్, డా.విజయరావు, డా. రామకృష్ణ, డా.రమేష్, పుర ప్రముఖులు నూతన కార్యవర్గ సభ్యుల కుటుంబ సభ్యులు, రివర్ సైడ్ క్లబ్ సభ్యులు మంగళగిరి హనుమంతరావు, ఐతంరాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులపై పన్నుల భారం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

దమ్మపేట: బడ్జెట్‌లో సామాన్యులపై పన్నుల భారం మోపి, పెట్టుబడి దారులకు అండగా బీజేపీ ప్రభుత్వం నిలిచిందని పలువురు నాయకులు అన్నారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ అఖిలభారత ప్రగతిశీల రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రం అయిన దమ్మపేట గ్రామంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్లూరి కిషోర్, ఆమర్లపూడి రాములు, గోకినపల్లి ప్రభాకర్, నూప భాస్కర్, పోతుగంటి లక్ష్మణ్, వగ్గెల ప్రసాద్, పండూరి వీరబాబు, కుర్సం ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై నాయకుల ఆందోళన



ఢిల్లీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న నాయకులు

చర్ల: ఎస్సీ వర్గీకరణపై ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం వర్గీకరణ చేసుకోవాలంటూ రాష్ట్రాలకు అధికారాలు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఢిల్లీలో జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో చర్ల మండలానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు. ఢిల్లీలోని తెలంగాణా భవన్, అంబేడ్కర్ విగ్రహం, జంతర్‌మంతర్‌ల వద్ద నిర్వహించిన నిరసన కార్యాక్రమాల్లో మండలానికి చెందిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తోటమళ్ల రమణమూర్తి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడెళ్ల గణపతి, నాయకులు తోటమళ్ల విజయరావు, నిట్టా అబ్బులు, తోటమళ్ల కృష్ణారావు, రుంజా సుమన్, చీదరగడ్డ రవికుమార్, ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షులు పుట్టి శ్రీనివాస్ ఉన్నారు.

'ఉపాధి' పథకంపై కేంద్రం నిర్లక్ష్య వైఖరి



మాట్లాడుతున్న కాంతారావు

కరకగూడెం: ఉపాధి హామీ పథకంపై కేంద్రం నిర్లక్ష్య వైఖరి వీడాలని సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతారావు అన్నారు. మండలంలోని నీలాద్రిపేట గ్రామంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రెండేళ్లుగా ఉపాధి పథకంలో గతంలో ఎన్నడూలేని కొత్త నిబంధనలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని, అంతే కాకుండా ప్రభుత్వ సంస్థలన్నింటినీ అదానీ వంటి పెట్టుబడుదారులకు అప్పగించేలా మోదీ ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

నల్లాలు సరే.. నీళ్లేవి..?

- అలంకారప్రాయంగా మారిన మిషన్ భగీరథ కనెక్షన్లు..
- నీరు రాక ఏళ్లుగా ఇబ్బంది







అలంకారప్రాయంగా ఉన్న మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు

దుమ్ముగూడెం: ఇంటింటికీ శుద్ధ జలాలను అందించాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టి మిషన్ భగీరథ పథకం కొందరు అధికారుల తీరుతో పథకం అభాసుపాలవుతోంది. మండలంలోని మారుమూల గ్రామాలకే మిషన్ భగీరథ నీరు రావడం లేదనుకుంటుంటే మండలంలోని ప్రధాన గ్రామమైన లక్ష్మీనగరంలో కూడా భగీరథ నీరు రాక పోవడం అధికారుల పనితీరుకు నిదర్శనం. గ్రామంలోని ప్రధాన రహదారికి ఎడమ వైపున, ప్రధాన సెంటర్‌లో ఉన్న సుమారు 30 ఇళ్లకు మిషన్ భగీరథ పథకం ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు భగీరథ నీరు రావడం లేదంటే అతిశయోక్తి కాదు. గతంలో ఉన్న పంచాయతీ పైప్‌లైన్ ద్వారా నీరు సక్రమంగా వచ్చేది కానీ మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసాక ఒక్క నీటి చుక్క కూడ చూడలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ నీరు రావడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని అంటున్నారు.

ఉన్న నాలుక ఊడిన చందంగా..

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్నట్టు గ్రామంలో నీరందించే పంచాయతీ పైప్‌లైన్‌ను వదిలి మిషన్ భగీరథ పైప్‌లైన్ వేశారు. కానీ పైప్‌లైన్ వేసే క్రమంలో ఎగుడుదిగుడుగా వేయడంతో నీళ్లు రావడం లేదు. స్టేట్‌బ్యాంకు దగ్గర నుండి నాగార్జున బ్యాంకు వరకు ఉన్న ఇల్లకు నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల ముందు అలంకారప్రాయంగా ట్యాప్‌లను మాత్రం అధికారులు ఏర్పాటు చేశారని నీరు మాత్రం రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఆ ఇళ్లకు మిషన్ భగీరథ నీళ్లు అందెలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే లక్ష్మీనగరం గ్రామంలో ఇళ్ల సంఖ్య పెరగడంతో ప్రస్తుతం ఉన్న తాగునీటి ట్యాంకు 90వేల లీటర్ల సామర్థ్యం సరిపోక నీరు పూర్తి స్థాయిలో అందడం లేదు. రోడ్డుకు రెండువైపులా 45 నిమిషాల చొప్పున నీటిని పంచాయతీ సిబ్బంది వదులుతున్నా అవి అరకొరగానే అందుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామంలో మరో వాటర్‌ట్యాంకును సైతం నిర్మించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి

లక్ష్మీనగరం గ్రామంలో మిషన్ భగీరథ నీరు రాని ఇళ్లకు తక్షణమే అధికారులు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఇళ్ల ముందు అలంకారప్రాయంగా ట్యాప్‌లు దర్శనం ఇస్తున్నాయి. మండల ప్రధాన గ్రామమైన లక్ష్మీనగరంలో నీరు ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యమే తక్షణమే సమస్యను పరిష్కరించాలి.

– యలమంచి వంశీ, సీపీఎం నాయకులు